టి. శ్రీవల్లీ రాధిక

# మహార్ణవం

"..తను ఒక సముద్రమనీ.. స్త్రీ తన కోసం ప్రవహించే నదిలాంటిది అనీ తలపోస్తాడు పురుషుడు.
ఆమెలోని సున్నితత్వాన్ని ప్రేమిస్తాడు.. ఆరాధిస్తాడు. ఆమె బలహీనతలకు జాలిపడతాడు.. నవ్వుకుంటాడు. తగిన స్నేహితురాలు కాదన్న అసంతృప్తితో బాధపడతాడు.
కానీ ఒక్క క్షణం ఆమె పెదవి విప్పి.. అతని అవసరమే తనకు లేదన్న మహార్ణవ వ్యక్తిత్వాన్ని ప్రదర్శిస్తే అతనేమవుతాడు!!..."
సరిత ఉత్తరంలోని వాక్యాలు అవి. ఆమె లెటర్స్ ఎన్నిసార్లు చదివినా చదవాలనిపిస్తాయి. కొన్ని కొన్ని వాక్యాలు చదువుతున్నపుడు అసలు అర్థం కావు. వాక్య నిర్మాణంలోని అందం ఆకర్షిస్తుంది. అంతే. కానీ ఆ తరువాత.. ఎపుడో ఆలోచనల్లో పడి నలిగాక, అర్థమయ్యాక, అప్పుడు.. అద్భుతంగా అనిపిస్తాయి.

*****

స..రి..త..!!
నేనంటే ఆ అమ్మాయికి ఎంతటి ఆరాధన వుందో ఆమె కళ్ళలోకి చూసిన ప్రతిసారీ అర్థమవుతుంది నాకు.
ప్రేమ సముద్రం కనిపిస్తుంది అక్కడ.
నా ఎదురుగా కూర్చుంటుంది. చెక్కిలికి చేయి చేర్చి నేను చెప్పే కబుర్లన్నీ యింతింత కళ్ళేసుకుని వింటూ వుంటుంది.
నేను కొంచెం మనోహరంగా నవ్వితే ముంగాళ్ళపై లేచి నా పెదవులందుకుంటుందేమో అనిపించేలా...

కాస్త గంభీరంగా చూస్తే, అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చి నా గుండెల్లో వదిగిపోతుందేమోననుకునేలా..

అసలు ఆ అమ్మాయి నా ముందు కూర్చోవడం.. మాట్లాడడం.. అదంతా ఓ గొప్ప అనుభవం.

పసిఫిక్ లాంటి మహాసముద్రంలో ఒక్కడ్నీ పడి ఈదుతున్నట్లుంటుంది. మధ్యలో ఒకసారి తలెత్తి వూపిరి పీలుస్తుంటే, గుండె ఆయాసంతో చేప పిల్లలా ఎగిరినట్లవుతుంది.

ఇంక ఒడ్డుకి వెళ్ళడం మంచిదేమోననిపిస్తుంది. అంతలోనే మునకే సుఖంగా వుంటుందని తోస్తుంది. ఆ థ్రిల్‌ని మాటల్లో చెప్పడం కష్టం. నేను మొట్టమొదటిసారి సరితని చూసింది ఎనిమిదేళ్ళ క్రితం.

పదహారేళ్ళో పదిహేడేళ్ళో వుండేవి ఆమెకపుడు.

పరుగెత్తే పాదాలపై పరికిణీ కుచ్చిళ్ళు.. ప్రతి మంచి భావానికీ పల్లకీలయ్యే కళ్ళు..

నాకేమో ముప్పై దాటిన వయస్సు. లాయర్‌గా గొప్ప పేరు.

ఈ ఊరికి కొత్తగా వచ్చిన రోజులవి.

ఇల్లు సిటీకి దూరంగా వుండేది.

అందుకే ఆఫీస్ కోసం సిటీ సెంటర్ లో ఒక రూం అద్దెకు తీసుకున్నాను, సరితా వాళ్ళ పిన్ని గారింట్లో.

ఒకరోజు మధ్యాహ్నం.. నేను ఆఫీసు రూం లో కూర్చుని ఏదో చదువుకుంటున్నాను.

"మా పిన్నీ వాళ్ళు లేరాండీ!" అన్న మాటలకి ఉలిక్కిపడి చూస్తే.. గడపలో సరిత.

గంధం రంగు పట్టు పరికిణీ.. మెరూన్ కలర్ ఓణీ.. తళ తళలాడే కళ్ళూ.. ఆరోగ్యంతో తుళ్ళిపడే వళ్ళూ..

నేను తెలీదన్నాను. చేతిలో బ్యాగ్‌తో కాసేపు తటపటాయింపుగా నిలబడిపోయింది.

నాకు లోపలికి రమ్మనాలని తోచలేదు. తలవంచుకుని మళ్ళీ చదువుకోవడంలో లీనమయిపోయాను.

కాసేపటికి పోస్ట్‌మాన్ కేక వినబడి బయటకి వచ్చాను. సరిత అక్కడే కూర్చుని వుంది.. కణకణలాడే ఎండలో.

వాళ్ళ లెటర్స్ తను తీసుకుంటూ.. నా లెటర్ నాకందించింది.

"లోపలికి వచ్చి కూర్చోమ్మా" అన్నాను నేనపుడు.

వెంటనే వచ్చింది.. బ్యాగ్ తీసుకుని.

కిటికీ దగ్గరి కుర్చీలో బెరుకుగా కూర్చుని బయటకి చూడసాగింది.

"ఏం చదువుతున్నావు?" పలకరించాను నేను.

చెప్పింది.

మెల్లగా మాటలు మొదలయ్యాయి మామధ్య. మాట్లాడాక అర్థమయింది, నేననుకున్నంత బెరుకుతనమేమీ లేదు తనకి.

ప్రతిమాటకీ ఒక్కోరకం భావాన్ని కళ్ళలో పలికిస్తూ హుషారుగా మాట్లాడే ఆమెని చూస్తే అద్భుతంగా అనిపించింది.

ఆమె కళ్ళను మెరిపించే విషయాలను యింకా యింకా చెప్పాలనిపించింది.

ఏ విషయాన్నైనా అనర్గళంగా మాట్లాడగలిగిన నాలాంటివాడికి.. అలాంటి అమ్మాయి శ్రోతగా దొరికితే.. యిక అంతకంటే కావలసినదేముంది!

ఆతర్వాత.. సరిత వాళ్ళ పిన్నివాళ్ళింటికి వచ్చినప్పుడల్లా.. నాకోసం చూసేది. ఆ టైముకి నేను ఆఫీసులో వుంటే, వచ్చి కబుర్లు చెప్పేది.

కొన్నాళ్ళ తర్వాత నా ఆఫీస్ అక్కడినుంచి మార్చేశాను. అపుడిక అచ్చంగా.. నాతో కబుర్లు చెప్పేందుకే నా ఆఫీసుకి వచ్చేది.

తెలుగు సాహిత్యంలో చాలా ఆసక్తి నాకు. ఎక్కువగా ఆ విషయాలే

మాట్లాడుకునేవాళ్ళం.

విశ్వనాథ.. చలం.. సులోచనారాణి.. రంగనాయకమ్మ..

సరిత దగ్గర నేను మాట్లాడని వ్యక్తులు లేరు. అభిప్రాయాలు వ్యక్తపర్చని విషయాలూ లేవు.

"తిరిగే పాల కడవలపైనా.. నురగా నురగలుగా..

మరిగే రాధ మనస్సుపైనా.. తరకాతరకలుగా..

ఎవరో పరచినారమ్మా.. వెన్నెల పరచినారమ్మా.."

నేను చెప్తుంటే ఆ అమ్మాయి నవ్వేదీ.., మిట్టమధ్యాహ్నం నా ఆఫీస్ గదిలోకి వెన్నెల వరదలై వచ్చినట్లుండేది.

మొదట్లో నాకు వేరే ఆలోచన ఏమీ వుండేది కాదు.

కృష్ణశాస్త్రి గురించి చెప్పినా.. శ్రీశ్రీ గీతాలు పాడినా.. అదంతా ఆ అమ్మాయి కళ్ళలోని ఆనందాన్ని చూసి ఆనందించే ప్రయత్నమే.

కానీ ఆ ప్రాసెస్‌లో.. ఆమె కళ్ళలో అందం.. ఆనందం.. వాటివెనుక నా పట్ల ఆరాధన.. అవన్నీ చాలా స్పీడ్‌గా పెరిగాయి.

మొదట నేను గమనించలేదు. గమనించేసరికి చాలా ఆలస్యం అయింది.

నాకు కూడా ఆమె అంటే ఆకర్షణ మొదలయింది.

ఇంకొన్నాళ్ళు ఆమె ఈ వూర్లోనే వుంటే ఏమయ్యేదో! ఎవరం ముందుగా బయటపడేవాళ్ళమో!

ఆమెకి పెళ్ళయ్యింది. భర్తతో కలిసి మద్రాస్ వెళ్ళిపోయింది.

అక్కడినుంచి లెటర్స్ రాసేది.

ప్రతి లెటర్‌లోనూ నన్ను చూడాలని వుందన్న వాక్యం తప్పకుండా వుండేది.

నాకూ ఆమెని చూడాలని చాలా తీవ్రంగా అనిపించేది.

ఒకసారి ఏదో పని పెట్టుకుని మద్రాస్ ప్రయాణం అయ్యాను కూడా. మళ్ళీ కుదరక మానేశాను.

అలాంటి సరిత..

రెండేళ్ళ తర్వాత.. ఇవాళ సాయంత్రం ఆరుగంటలప్పుడు.. హటాత్తుగా..

పసిపిల్లాడ్నెత్తుకుని నా ఆఫీస్ గదిలో అడుగుపెడుతుంటే..

నా గుండె వేగంగా కొట్టుకుంది.

నాకే ఆశ్చర్యం అనిపించింది. ఈ వయసులో కూడా యింతగా ఉత్తేజితుడ్ని అవుతున్నానా! అని.

అప్రయత్నంగా కుర్చీలో ముందుకు వంగుతూ "ఎప్పుడొచ్చావ్!" అన్నాను.

పసిపిల్లాడితో మెట్లన్నీ ఎక్కి వచ్చిందేమో, కొద్దిగా ఆయాసపడుతూ.. నన్ను చూసిన ఆనందంతో నవ్వుతూ.. "నిన్న సాయంత్రం" అంది.

నేను ఫైళ్ళన్నీ టకటకా సర్ది ప్రక్కన పెట్టాను. కాళ్ళు ముందుకు చాపుతూ కుర్చీలో వెనక్కి వాలాను.

ఆమె పిల్లాడిని వడిలో పెట్టుకుని కుర్చీలో వదిగి కూర్చుంది.

ఇరవై.. ముప్పై.. అరవై.. ఎనభై.. కబుర్లతో నిమిషాలు ఎలా దొర్లిపోతున్నాయో తెలీడం లేదు.

ఎన్నో ఏళ్ళు నిశ్శబ్దపుటెడారులలో తిరిగి, యిపుడే మాటల ఒయాసిస్‌ని కనుగొన్నట్లూ గలగలా మాట్లాడేస్తున్నాం యిద్దరమూ.

పిల్లాడికి వరుణ్ అని పేరు పెట్టిందట. నా మనసు ఆనందంతో ఉప్పొంగింది.

ఆ పేరంటే నాకు చాలా యిష్టం. మా అబ్బాయికి పెట్టాలనుకున్నాను. మా ఆవిడ ఒప్పుకోలేదు. ఆ విషయమే ఒకసారి సరితకి చెప్పాను. అది గుర్తు పెట్టుకుందన్న మాట.

పిల్లాడు పుట్టగానే మరో ఆలోచన లేకుండా అదే పేరు పెట్టుకుందన్న మాట.

నాకు చాలా సంతోషంగా అనిపించింది.

మాట్లాడుతూనే టైం చూశాను. ఏడున్నర అవుతోంది.

సరిగ్గా అప్పుడు..

అంతవరకూ కామ్‌గా వున్న వరుణ్ ఒక్కసారిగా అల్లరి మొదలు పెట్టాడు.

ఎందుకొచ్చిందో వాడికి ఉన్నట్లుండి ఏడుపు!

వాడిని సముదాయించడంలో సతమతమవుతూ సరిత నవ్వింది.

"వెళ్తానండీ యింక" అంది.

"వెళ్ళచ్చులే వుండు" అన్నాను నేను.

నాకు తెలుసు. నేనలా అంటే యిక ఆమె కదలలేదు. నామాట కాదని వెళ్ళలేదు.

ఏమో! వెళ్ళిపోతుందేమో! పిల్లాడు ఏడుస్తున్నాడు కదా!

ఏం చేస్తుంది!

నా మాటకి కట్టుబడుతుందా! పిల్లాడి ఏడుపుకి భయపడుతుందా!

ఛాలెంజింగ్‌గా అనిపించింది.

ఎంతసేపు కూర్చోపెట్టగలను సరితను నేనివాళ యిక్కడ!

ఆమె పిల్లాడిని వడిలో పడుకోబెట్టుకునేందుకు ప్రయత్నిస్తోంది. వాడు నిలవడం లేదు.

నేను అదంతా అసలేమీ గమనించనట్లూ కబుర్లు కంటిన్యూ చేశాను.

పెళ్ళయ్యాకా.. తల్లయ్యాకా కూడా సరిత యింతగా నా పట్ల ఆకర్షితురాలవడం చాలా థ్రిల్లింగ్‌గా వుంది నాకు.

మామూలుగా అయితే పిల్లల ఏడుపులూ, అల్లర్లూ పెద్దగా భరించలేను నేను.

కానీ యివాళ సరదాగా వుంది.

వాడి అల్లరి జయిస్తుందా! నా ఆకర్షణ జయిస్తుందా అని పంతంగా వుంది.

కాళ్ళు లయగా వూపుతూ.. వాడి అసహనాన్ని రెండు చేతులతో కప్పి పెడ్తూ.. "ఆకలేస్తున్నట్లుంది. లేకపోతే యిలా ఏడవడు" అంది యిబ్బందిగా.. సంజాయిషీ చెప్తున్నట్లూ.

నేను ఆమాటలు వినబడనట్లే చూశాను.

నా ధోరణిలో నేను మాట్లాడసాగాను.

వాడిని బలవంతంగా నిద్రపుచ్చే ప్రయత్నం చేస్తూ ఆమె నా కబుర్లు వింటోంది.

ఒకప్పుడు మనముందు పరుగులెత్తుతూ తిరిగిన పిల్లని ఒక్కసారిగా తల్లి రూపంలో చూడడం తమాషాగా వుంటుంది.

అలా కాళ్ళు వూపుతూ.. వాడు కాళ్ళతో తంతుంటే మొహం తిప్పుకుంటూ.. ఆమె మాట్లాడటం అద్భుతంగా వుంది.

ఆ వూపడంలో ఏమాత్రం లయ తప్పినా వాడు కేర్ మంటున్నాడు. ఆమె మళ్ళీ కంగారుగా కాళ్ళు వూపుతోంది.

అయినా మొహంలో అలసట లేదు. విసుగు లేదు. విచ్చుకున్న ఆ కళ్ళల్లో నాపట్ల ఆరాధన తప్ప మరేమీ లేదు. ఆ..రా..ధ..న! ఆరాధన కాదు అది.. కోరికా!

అవును. నిస్సందేహంగా కోరికే అది.

చిక్కటి చీకటిలాంటి ఆ కాటుక కళ్ళ క్రింది నుంచి యిప్పటికీ అది కనిపిస్తోంది.. ఆమె సింధూరం మెరుపులో.. ముక్కుపుడక తళుకులో.. అది యిప్పటికీ స్పష్టంగా కనిపిస్తోంది.

అతి కష్టం మీద వరుణ్‌ని నిద్రపుచ్చి సోఫాలో పడుకోబెట్టింది సరిత.

నేను మళ్ళీ గడియారం చూశాను. ఎనిమిదిన్నర అవుతోంది. చాలా దూరం వెళ్ళాలి ఆమె. ఎలా వెళ్తుందో!

ఇంత రాత్రప్పుడు.. చీకట్లో వంటరిగా వెళ్తుంటే, ఏ రౌడీ వెధవలన్నా అటకాయిస్తే!

వయసులో వున్న అందమైన పిల్ల కదా! ఏమైనా చేస్తే! మెడలోని నగలూ గట్రా లాక్కుంటే!

అలాంటి భయమే కనిపించడంలేదు ఆమెలో. నామీద ఆకర్షణ తప్ప మనసుకు

మరే విషయంతోనూ సంబంధం వున్నట్లు లేదు.

అంత అందమైన, తెలివైన అమ్మాయి నన్ను యింతలా అభిమానించడం చూసి నా అహంకారం రొమ్ము విరుచుకుంటోంది.

నా కళ్ళలోకే తన్మయత్వంతో.. మళ్ళీ ఎప్పటికి చూస్తానో అన్న వేదనతో చూస్తోంది సరిత.

ఒక్కక్షణం మొహం తిప్పితే.. తను సంపాదించుకోవలసిన ఆనందంలో చాలా కోల్పోతానన్న భయంతో చూస్తోంది.

ఒక భావాన్నో.. జ్ఞాపకాన్నో.. వస్తువునో తీసుకెళ్ళినట్లూ నన్ను తనతో తీసుకువెళ్ళలేని అశక్తతతో చూస్తోంది.

ఇంకాసేపు ఆగి బయటకి వెళ్తే అపుడేం చేస్తుంది!

చిక్కటిచీకటిని చూసి దడుచుకుంటుందా!

ఒక బస్ గానీ ఆటో గానీ కనపడకపోతే భయపడుతుందా!

నన్ను డ్రాప్ చేయమని అడుగుతుందా! నేను చచ్చినా చేయను.

అంత వళ్ళు తెలీనట్లూ కూర్చున్నందుకు ఆ కష్టాలు ఆమే భరించాలి.

అవును మరి. పెళ్ళయ్యింది. లక్షణమైన మొగుడున్నాడు. అయినా నామీద ఆకర్షణ ఏమిటి ఈ పిల్లకి! పిల్లాడు ఏడుస్తున్నా లెక్క చేయని నిర్లక్ష్యం ఏమిటి!

ఇలాంటి ఆడపిల్లలకి అలాగే జరగాలి. అలాంటి ప్రమాదాలు ఏమైనా జరగాలి. అపుడే బుద్ధొస్తుంది.

నా ఆలోచనలకి నేనే ఉలిక్కిపడ్డాను.

"ఏమిటీ శాడిజం!" అంతరాత్మ మందలించింది.

శా..డి..జ..మా! నాకా! నమ్మలేనట్లుగా అనుకున్నాను.

కాకపోతే ఏమిటి?

నన్ను ఒక అమ్మాయి అభిమానిస్తుంటే.. ఆ అభిమానాన్ని ఒకప్రక్కనుంచి

నేను కూడా ఎంజాయ్ చేస్తున్నాను. మరోప్రక్కన ఆ అమ్మాయి అలా వుండడం తప్పనీ.. పెళ్ళయినా నన్ను ఆరాధించడం నేరమనీ నమ్ముతున్నాను.

అందుకు.. ఆ అమ్మాయికి.. ఆ అమ్మాయికి మాత్రమే శిక్ష పడాలనీ.. యిబ్బందుల పాలవాలనీ కోరుకుంటున్నాను.

లేకపోతే ఎందుకి ఆట నాకు!

లేట్ అయితే.. బాగా చీకటి పడితే ఆ అమ్మాయి ఒక్కతీ వెళ్ళడం కష్టమని తెలిసీ ఎందుకి ఆట నాకు!

సరిత ఏదో చెప్తోంది.

కానీ నా మనసు అది వినిపించుకోవడం లేదు. ఆత్మ విమర్శ మొదలయింది నాలో.

ఎందుకిలా ఆలోచిస్తాడు పురుషుడు! రాత్రి పూట చీకట్లో నాకు సరిగా కనబడదు. సరిగా డ్రయివ్ చేయలేను.

ఇపుడు యింటికి వెళ్తూండగా నాకు ఏ యాక్సిడెంటన్నా అయితే! నా భార్యాబిడ్డలు అనాధలయితే!

ఎందుకలా అనుకోలేదు నేను!!

ఒక్కటే కారణం..

నేను తప్పు చేస్తున్నానన్న భావం నాకు లేదు.

ఆమె అందం పట్ల నాకున్న ఆకర్షణ తప్పు కాదు. కానీ నా వ్యక్తిత్వం పట్లా.. విజ్ఞానం పట్లా ఆమెకున్న ఆరాధన తప్పు!!

ఇదీ నాలాంటివాడి మనసులో.. ఎంతో సంస్కారవంతుడినీ, నాగరికుడినీ అనుకునే నాలాంటివాడి మనసులో.. వున్న ఆలోచన.

నిజంగా యింతకంటే దారుణం ఏముంది! పురుషాహంకారం కాకపోతే ఏమిటిది!!

తలత్రిప్పి వరుణ్ వైపు చూశాను.

ప్రశాంతంగా నిద్రపోవడం లేదు వాడు. ఆకలి తెచ్చిన చిరాకుతో కాబోలు వాడి నొసలు ముడుచుకుని వున్నాయి. గొంతులోనుంచి వెక్కిళ్ళు గురకలాంటి శబ్దంతో బయటకి వచ్చే ప్రయత్నం చేశాయి.

అది వినగానే సరిత వులిక్కిపడి కదిలింది. మీద చేయి వేసేసరికి ఒక్కసారిగా కళ్ళు తెరిచి మళ్ళీ ఏడుపందుకున్నాడు వరుణ్.

వాడ్ని భుజం మీద వేసుకుంటూ సరిత నిలబడింది. హ్యాండ్ బ్యాగ్ భుజానికి తగిలించుకుని, "నే వెళ్తానండి!" అంది కంగారుగా.

"సరే" అన్నట్లు తల వూపబోయాను. కానీ అప్పటికే తను వెనుతిరిగింది.

"నేనూ వస్తున్నానుండు" అన్నాను.

నా మాటలతో సంబంధం లేనట్లూ వాకిట్లోకి నడిచింది.

నేను కూడా లేచి ఆఫీసుకి తాళం పెట్టి, తన వెనుకే వడివడిగా మెట్లు దిగాను.

పిల్లాడిని షాల్‌తో కప్పి గుండెలకి హత్తుకుంది సరిత.

"..వచ్చేముందే పాలు పట్టి తీసుకొచ్చాను. ఎంత ప్రయత్నించినా తొమ్మిదిన్నర లోపల మళ్ళీ తాగడు రోజూ. ఇవాళ ఏమయిందో మరి!.. ఇలా ఏడుస్తున్నాడు" స్వగతంలా అంది ఆమె.

"..ఏదో చిరాకుగా వున్నాడులే.. నిద్రపోయాడు కదా! అనుకున్నాను కానీ.. ఇంతసేపు ఆపకుండా ఏడుస్తుంటే.." నీళ్ళు నిండిన కళ్ళతో నవ్వింది సరిత. గొంతులో మాతృత్వపు మధురిమ తొణికిసలాడింది.

నేనేదో అనబోయాను.

అంతలో దూరంగా.. రోడ్డుకి అటు చివర ఒక ఆటో కనబడింది. ప్రక్కరోడ్డులోకి తిరగబోతూ వుంది అది.

ఏంచేయాలా అని నేను ఆలోచించేలోపలే.. సరిత అరిచింది "ఆ..టో" అని.

నేను ఉలిక్కిపడ్డాను. వీణ మీటినట్లు వినబడే సరిత గొంతు అవసరమయితే

డి. శ్రీవల్లీ రాధిక

అంత ఖంగున మోగగలదని నేనెప్పుడూ అనుకోలేదు.

నేను తేరుకునేలోపే, ఆటో వచ్చి ఆగడం.. "వస్తానండీ" అంటూ ఆమె అందులో కూర్చోవడం జరిగిపోయాయి.

ఆటో రివ్వున వెళ్ళిపోతుంటే సరిత కనీసం వెనుతిరిగి చూడలేదు. వడిలో పిల్లాడిని సర్దుకుంటోంది.

ఆటో కనుమరుగయాక.. నేను వెనక్కి నడిచాను.

స్కూటర్ తీసి స్టార్ట్ చేసుకుంటుంటే .. గుండెల్లో దుఃఖం సుళ్ళు తిరిగింది. ఒక మూల నుంచి ఆనందమూ క్రమ్ముకుంది.

అసంతృప్తి.. సంతృప్తి.. రెండు కెరటాల్లా హృదయాన్ని వూపేశాయి.

ఏది ఎందుకో మాత్రం అర్థం కాలేదు.

*****

("ఆంధ్రప్రభ" సచిత్ర వారపత్రిక - 31 మే 1995 కథాప్రభ)